సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 23 । జూలై । 2023



చీనీ టన్ను రూ.19,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19,500 పలికాయి.



టమాట కిలో రూ.94

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.94 పలికింది. కనిష్టం రూ.53, సరాసరి రూ.75 ప్రకారం క్రయవిక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
32.7°/22.1°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

గుట్బూరు ఆస్పత్రిలో విజిలెన్స్



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్బూరు ప్రభుత్వ ఆసుపత్రిని విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఫార్మసీ గదులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, హాజరు, ఖాలీల వివరాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, తదితర అంశాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో నదులు, జలాశయాలు జలకళ సంతరించుకుంటున్నాయి. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. శివమొగ్గ జిల్లా పరిధిలోని తుంగా జలాశయం నుంచి 19,506 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తుండడంతో ఆ నీరంతా తుంగభద్ర జలాశయానికి చేరుతోంది. శనివారం ఉదయానికి 34,071 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. 20వ తేదీన 9,536 క్యూసెక్కులు, 21న 13,340 క్యూసెక్కులు వస్తూ ఒకేసారి 34,071 క్యూసెక్కులకు నీరు పెరిగింది. దీంతో డ్యాంలో మొత్తం నీటి నిల్వ 16.649 టీఎంసీలకు చేరింది.

పల్లె.. పిచ్చి చేష్టలు మానుకో

- వైఎస్సార్ సీపీ నాయకుల హెచ్చరిక
- నియోజకవర్గ వ్యాప్తంగా మాజీ మంత్రి దిష్టిబొమ్మల దహనం

అమడగూరు: పిచ్చి చేష్టలు మానక పోతే ఊరుకునేది లేదని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై పల్లె చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఓడీ చెరువు బస్టాండులో పల్లె రఘునాథ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజకీయాలు వేరు, వ్యాపారాలు వేరనే విషయాన్ని 'పల్లె' గుర్తుంచుకోవాలన్నారు. పెద్ద పెద్ద వ్యాపారాలు చేసేవాళ్లు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం సహజమన్నారు. రెండేళ్లు కోవిడ్‌తో వ్యాపారాల్లో నష్టం రావడం, తర్వాత కర్ణాటకలో ఎన్నికల కోడ్‌తో లావాదేవీలు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సంస్థ బ్యాంకుకు కంతులు చెల్లించడంలో జాప్యం జరిగిందన్నారు. బ్యాంకు నోటీసులు పంపిస్తే నీకు వచ్చిన నష్టం ఏంటని, ప్రజలకు జరిగే నష్టం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తన ఆస్తులను తనఖాగా చూపించి రుణాలు తీసుకున్నారని, పల్లె రఘునాథ రెడ్డిలా విద్యార్థుల పొట్ట కొడుతూ, ఫీజులు కొల్లగొడుతూ, దొంగ డీడీలు, చెక్‌లు ఇస్తూ మోసం చేయలేదని విమర్శించారు. పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా తారురోడ్లు వేయించడం, అత్యధిక ఇళ్లు మంజూరు చేయించడం, 193 చెరువులకు నీళ్లు తెప్పించడానికి కృషి చేయడం, జిల్లా కేంద్రం సాధించడంలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న పల్లె రఘునాథ రెడ్డి తమ్ముళ్లకు దోచి పెట్టడమే తప్ప నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. 'చిల్లర రాజకీయాలు మానుకోక పోతే పల్లెవాండ్లపల్లికి తరిమి కొడతాం.. తస్మాత్ జాగ్రత్త' అంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్‌బాషా, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, అగ్రి బోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బత్రాజుల సంఘం డైరెక్టర్ మధుసూదన్ రాజు, సర్పంచ్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఓడీ చెరువులో పల్లె దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నల్లమాడలో పల్లె రఘునాథరెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

నల్లమాడలో 'పల్లె' శవయాత్ర

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేక టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డి కుట్రకు తెరలేపారని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం నల్లమాడలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ ఆధ్వర్యంలో పల్లె రఘునాథరెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో దిష్టిబొమ్మ దహనం చేశారు. నాగులకట్ట శివాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆసాది గంగిశెట్టి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పారకల రమణ, మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రజనీకాంత్‌రెడ్డి, మండల పార్టీ పరిశీలకుడు కేశప్ప, నాయకులు నాగరాజు నాయుడు తదితరులు మాట్లాడారు. పచ్చ మీడియాలో దుష్ప్రచారం చేయించడం మాజీ ఎమ్మెల్యే పల్లె సంకుచిత రాజకీయానికి నిదర్శనమన్నారు. ఎలాంటి బ్యాంకు రుణాలు తీసుకోకుండానే నీవు పదుల సంఖ్యలో కాలేజీలు కట్టావా అంటూ ప్రశ్నించారు. అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులను జలగలా పట్టి పీడిస్తున్నది నీవు కాదా అంటూ నిలదీశారు. వేల కోట్ల అవినీతికి పాల్పడిన మీ పార్టీ మాజీ నాయకులు సీఎం రమేష్, సుజనా చౌదరి, స్కాంలో ఇరుకున్న అచ్చెన్నాయుడు సంగతేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మండల పార్టీ పరిశీలకులు నాగమల్లేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు

పుట్టపర్తి టౌన్: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక పచ్చ మీడియాతో కలిసి కుట్రలు చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని గణేష్ కూడలిలో పల్లె రఘునాథరెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. వారు మాట్లాడుతూ పల్లె రఘునాథ రెడ్డి నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజా నాయకుడిపై లేనిపోని ఆరోపణలు చేస్తే వచ్చే ఎన్నికల్లో ఓటర్ల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి. సూర్యాగౌడ్, పవన్‌కుమార్, సహకార సంఘం అధ్యక్షుడు రుషీకేశవ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు నారాయణరెడ్డి, రాంజీనాయక్, ఫొటోసాయి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో పల్లె రఘునాథ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

'మారుతండ్రి' అరెస్టు

- చిన్నారిపై పైశాచికంగా ప్రవర్తించిన ఘటనలో పోలీసుల చర్యలు



మణికంఠను అరెస్ట్ చేసిన పోలీసులు

హిందూపురం అర్బన్: పరుపుపై మూత్రం పోసిందన్న కారణంతో ఇనుప చువ్వ కాల్చి చిన్నారి మూతి, తొడ, ఇతర సున్నిత ప్రాంతాల్లో వాతలు పెట్టి పైశాచికంగా ప్రవర్తించిన మారుతండ్రిని హిందూపురం గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం సీఐ కృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు. కొటిపి బసవేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న అమృతకు చంద్రిక (6) సంతానమని తెలిపారు. భర్త దూరంగా ఉంటుండగా, ఆమె మణికంఠ అనే ఆటోడ్రైవర్‌తో కొంతకాలంగా సహజీవనం చేస్తోందని చెప్పారు. కొన్ని రోజుల క్రితం రాత్రి వేళ నిద్ర సమయంలో పరుపుపై మూత్ర విసర్జన చేస్తోందని ఇనుప చువ్వతో రెండు రోజుల పాటు చంద్రిక మూతి, తొడలపై మణికంఠ వాతలు పెట్టాడన్నారు. ఈ విషయంపై అంగన్‌వాడీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం మణికంఠను అతని ఇంటి వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

నెలాఖరు వరకూ వేరుశనగ సాగు

- శాస్త్రవేత్త సంపత్‌కుమార్, డీఏఓ సుబ్బారావు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: వేరుశనగ సాగు చేయడానికి ఈ నెలాఖరు వరకూ సమయం ఉందని కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సంపత్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయంలో ఈ క్రాప్ బుకింగ్‌పై వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 50 వేల హెక్టార్ల వరకూ పంటలు సాగు చేశారన్నారు. వర్షపాతానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఆగస్టు 15 వరకూ కంది, ఆముదం సాగు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో సాగు చేసిన ప్రతి పంటనూ పక్కాగా నమోదు చేయాలన్నారు. సర్వే నంబర్‌లోకి వెళ్లి ఫోటో తీస్తేనే వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరి, ఏరువాక కేంద్రం పుట్టపర్తి కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ రాజేష్, డాక్టర్ వేమన, డాక్టర్ చెనరాయుడు, డాక్టర్ రవి కిషోర్, డాక్టర్ కిషోర్‌రెడ్డి, సుధారాణి, బాలాజీ నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి కఠిన చర్యలు తప్పవు

- సరుకులు ఉన్నా లేవంటారా?
- కేజీబీవీ ఎస్‌ఓపై కలెక్టర్ ఆగ్రహం



మధ్యాహ్న భోజన పథకం సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మండల పరిధిలో ఖాజాపురం సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం బంగాళ దుంప కర్రీ విద్యార్థులకు అందించకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఈ విషయంపై ఎస్‌ఓ శిరీషను ప్రశ్నించగా.. బంగాళ దుంప స్టాక్ లేదని చెప్పారు. ఈ క్రమంలోనే నిత్యావసర సరుకులు నిల్వ ఉంచిన స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ బంగాళదుంప నిల్వ ఉండడం గుర్తించారు. ఎస్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలానే వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. మందలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నాణ్యతను చూశారు. అక్కడి నుంచి గ్రామ సచివాలయం చేరుకొని 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, సర్పంచ్ ప్రమీలమ్మ, సచివాలయ ఉద్యోగులు, ఆయా పాఠశాలల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

'వైఎస్సార్' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్స్ అవార్డు–2023, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళలు, సామాజిక పని, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ట్రేడ్‌అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్ రంగాల్లో రాణించిన వ్యక్తులు, గ్రామ, మురికివాడల్లో మంచి పనులు చేసి రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్న వారు, రాజకీయ, ఎన్‌జీఓ, లాభాపేక్ష లేని సంస్థలు, చారిత్రక స్వభావం కలిగిన సంస్థలు కాల పరీక్షలో నిలిచిన సంస్థలు దరఖాస్తుకు అర్హులని వివరించారు. కేటగిరి వారీగా ఆగస్టు 31లోగా దరఖాస్తు చేయాలని, వివరాలకు ఆన్‌సెట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

● కొలువుదీరిన కుళ్లాయిస్వామి



నార్పల: గూగూడు బ్రహ్మోత్సవాల్లో శనివారం కుళ్లాయిస్వామి పీర్లు కొలువుదీరాయి. స్వామి వారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి సన్నాయి వాయిద్యాల నడుమ తెల్లవారుజాము మూడు గంటల సమయంలో అర్చకులు హుసేనప్ప పీర్లను మకానంలో కొలువుదీర్చారు. చక్కెర చదివింపులు చేశారు. స్వామి దర్శన భాగ్యం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఈఓ శోభ, కో ఆప్షన్ మెంబర్ షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, నాయకులు గోపాల్, శివయ్య తదితరులున్నారు.

ఉత్సవాల్లో ఏ రోజు ఏమంటే..

23న స్వామి వారి నిత్యపూజ నివేదన, 24న ఐదవ సరిగెత్తు, 25న నిత్యపూజ నివేదన, 26న ఏడవ చిన్న సరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 27న నిత్యపూజ నివేదన, విడిదినం, 28న పెద్ద సరిగెత్తు, స్వామి వారి గ్రామోత్సం, 29న అగ్ని గుండ ప్రవేశం, గ్రామోత్సం, సాయంత్రం 4 గంటలకు జలధి నిర్వహిస్తారు. 31న స్వామి వారి చివరి దర్శనం ఉంటుంది.

భోజనం బాగా లేకుంటే ఫోన్ చేయండి

- విద్యార్థులకు జేసీ సూచన



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బాగా లేకుంటే ఫోన్ చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ విద్యార్థులకు సూచించారు. శనివారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న కేజీబీవీని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. నేరుగా వంట గదిలోకి వెళ్లి పరిశీలించారు. అక్కడ చిందరవందరగా కూరగాయలను పడేసి ఉండడం గుర్తించిన జేసీ.. పిల్లలు తినే కూరగాయలను నేలపై పోస్తే ఎలా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లు చిన్నసైజు ఉంటే వెనక్కు పంపాలని సూచించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఏ సమస్య ఉన్నా తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగసుప్రజ ఉన్నారు.

క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయండి

- ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సూచన


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కొత్తచెరువు మండలం కేశాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు నారపరెడ్డి, అనిల్‌కుమార్, ఆదిరెడ్డి, సాయినాథరెడ్డి, సుజాత, లక్ష్మీదేవి, విజయలక్ష్మి ఇతర పాఠశాలకు బదిలీ కావడంతో వారికి శనివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమన్నారు. ఎక్కడ పనిచేసినా విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేంద్రరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, చెన్నకృష్ణారెడ్డితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తెప్ప బోల్తా... వ్యక్తి మృతి


మృతుడు నారాయణస్వామి

చిలమత్తూరు: తెప్ప బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం బలిజపల్లి నివాసి నారాయణస్వామి(50) మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం కొడికొండ గ్రామంలోని పాత చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువు మధ్యలోకి వెళ్లిన తర్వాత తెప్ప బోల్తాపడి నీట మునిగి ఊపిరి ఆడక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గజఈతగాళ్ల సాయంతో నారాయణస్వామి మృతదేహాన్ని వెలికి తీయించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

1.67 లక్షల కొత్త కార్డులు

- సెప్టెంబర్ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో గోధుమపిండి పంపిణీ
- రాయలసీమ తరహాలో ఉత్తరాంధ్రలోనూ రాగుల పంపిణీ
- రైతు నుంచి మద్దతు ధరకు కంది కొనుగోలు చేసి కార్డుదారులకు అందిస్తాం
- రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్న సురక్ష' విజయవంతం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్


రాయదుర్గంలో జగనన్న లేఔట్‌లో పూర్తయిన ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ్‌కుమార్

రాయదుర్గం/ రూరల్/కళ్యాణదుర్గం: రాష్ట్రంలో 1.67 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్, జగనన్న సురక్ష అనంతపురం జిల్లా నోడల్ అధికారి అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఆయన శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. రాయదుర్గంలోని బీటీపీ రోడ్డు జగనన్న కాలనీలో కొత్తగా నిర్మించిన ఇళ్లను, డి.కొండాపురం సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ గోదాము, 74 ఉడేగోళం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని గూబనపల్లి లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. భవిష్యత్తులో జగనన్న కాలనీల్లో తామెందుకు లేకపోయామనే ఫీలింగ్ ఇతరులకు కలిగేలా తీర్చిదిద్దుతామన్నారు. 'జగనన్నకు చెబుదాం' అర్జీలు, 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 11 రకాల ఉచిత సేవలపై ఆరా తీశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో సరికొత్త మార్పులు..

ప్రజా పంపిణీ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టిందని కమిషనర్ అరుణ్‌కుమార్ తెలిపారు. రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలకు ప్రతి నెల 2.11 లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఇందుకోసం ప్రతి నెల రూ.846 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. దీనికితోడు మరో 1.67 లక్షల కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందించేందుకు కార్యాచరణ పూర్తయిందన్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా బియ్యంతో పాటు రాయలసీమ జిల్లాల్లో రాగులు, జొన్నల పంపిణీ ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. ఉత్తరాంధ్రలోనూ సెప్టెంబర్ నుంచి రాగులు అందిస్తామన్నారు. ఈ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్బన్ ప్రాంతాల్లో కిలో రూ.16తోనే గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామన్నారు. వచ్చే నెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లోనూ పంపిణీ చేపడతామన్నారు. మన రాష్ట్రంలో పండించిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేసి, నాణ్యమైన బియ్యం తయారుచేసి కార్డుదారులకు సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కంది నిల్వలు తగ్గిపోవడం కారణంగా సరఫరాలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మన రాష్ట్రంలో పండిన కందిని మనమే మద్దతు ధరతో కొనుగోలు చేసి మిల్లింగ్ చేపట్టాక కార్డుదారులకు అందించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష టన్నుల దాకా కంది అవసరమన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటనలో జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి శోభారాణి, జిల్లా మేనేజర్ నీలమయ్య, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, రాయదుర్గం మునిసిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఏడీ లక్ష్మోనాయక్, ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ నాగమణి, పీఆర్ జేఈ మునయ్య, ఏఓ మహేంద్ర, సర్పంచ్ దురుగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీపై ఆరా..

బెళుగుప్ప: హనిమిరెడ్డిపల్లిలోని 33వ నంబరు చౌక ధాన్యపు దుకాణాన్ని పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. తొలుత ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజన పథకం కింద సరఫరా అవుతుతున్న నిత్యావసర సరుకులను పరిశీలించి, ఎంఈఓ మల్లారెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చౌకధాన్యపు దుకాణం వద్దకెళ్లి స్టాకు వివరాల గురించి డీలర్ రజియాబీతో, రేషన్ సరుకుల పంపిణీపై కార్డుదారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, ఏఓ పృథ్వీసాగర్, సర్పంచ్ మారుతమ్మ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుల సంఘంలో నమోదు తప్పనిసరి

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం సూచన మేరకు జిల్లాలోని ఫుట్‌బాల్ క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు అందరూ తప్పనిసరిగా పేర్లు, వివరాలు నమోదు చేసుకోవాలని ల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలు, జట్ల ఎంపికలు, వివిధ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలంటే సంఘంలోని సభ్యులుగా ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుట్‌బాల్ క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు ఈ నెల 31 లోపు పేర్లను, వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 80995 98958లో సంప్రదించాలని కోరారు.

ప్రతి కళాశాలకు అటానమస్ తప్పనిసరి

- ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె. హేమచంద్రారెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి (చిత్రంలో) ఆలూరి సాంబశివారెడ్డి, వీసీ జింకా రంగజనార్దన

బుక్కరాయసముద్రం: రాబోవు రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి ఇంజినీరింగ్ కళాశాల స్వయం ప్రతిపత్తి (అటానమస్)ని కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతి విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచందారెడ్డి అన్నారు. బుక్కరాయసముద్రం మండలం రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ (అటానమస్) కళాశాల గ్రాడ్యుయేషన్ డే శనివారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమచంద్రారెడ్డి, జేఎన్‌టీయూ(ఏ) వైస్ చాన్సలర్ ఆచార్య జింకా రంగజనార్దన, ఎస్ఆర్ఐటీ కళాశాల అడ్వయిజర్ డాక్టర్ ఈఎస్ చక్రవర్తి, కళాశాల కరస్పాండెంట్, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ సత్యనారాయణ హాజరయ్యారు. కళాశాలలో విద్యనభ్యసించిన 433 మంది పట్టభద్రులకు పట్టాలు పంపిణీ చేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్య, ఎలక్ట్రికల్‌లో యర్రగుంట్ల లయ, మెకానికల్ ఇంజినీరింగ్‌లో ధూర్జటి కృష్ణ మనోహర్, ఎలక్ట్రానిక్స్‌లో మేఘన, కంప్యూటర్ సైన్స్‌లో పవన్ కళ్యాణ్ బంగారు పతకాలు అందుకున్నారు. అత్యధిక మార్కులు సాధించిన కృష్ణ మనోహర్‌కు ఆలూరి సుంకిరెడ్డి స్మారక, లయకు ఆలూరి నారాయణమ్మ స్మారక అవార్డులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హేమచంద్రారెడ్డి మాట్లాడారు. బడికి వెళుతున్న ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్యను అందజేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రతి ఇంజినీరింగ్ కళాశాల అటానమస్ న్యాక్‌గ్రేడ్ తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. కళాశాలను స్థాపించిన 14 ఏళ్ల వ్యవధిలోనే ఎంబీకే అక్రిడిటేషన్‌తో పాటు అటానమస్ పొందడం అభినందనీయమంటూ ఎస్ఆర్ఐటీ యాజమాన్యాన్ని అభినందించారు. సమావేశంలో జేఎన్‌టీయూ (ఏ) వైస్ చాన్సలర్ డాక్టర్ జింకా రంగజనార్దన, కళాశాల కరెస్పాండెంట్ అలూరి సాంబశివారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు


పదోన్నతుల ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పని చేస్తున్న ఏడుగురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. జెడ్పీ సహా ఉమ్మడి జిల్లాలోని అనుబంధ విభాగాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు చంద్రశేఖర్‌రెడ్డి (రొద్దం), వరదరాజ ప్రసాద్ (రామగిరి), నాగరాజు (చెన్నేకొత్తపల్లి), విజయభాస్కర్‌రెడ్డి (అనంతపురం), శ్రీనివాసరెడ్డి (అనంతపురం), ఆర్‌వీవీజీఎం ప్రసాద్ (రొళ్ల), లక్ష్మీశంకర్ (కుందుర్పి)ను పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ శనివారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ నాల్గో తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక

జిల్లా పరిషత్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అడ్‌హక్ విధానంలో ఏర్పాటైన కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా భరత్‌కుమార్, కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా ఎస్ఏ రహీం, అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణ, ఉపాధ్యక్షులుగా రామాంజినప్ప, ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఇస్మాయిల్‌తో పాటు కో-ఆప్షన్ సభ్యులుగా జగన్నాథ్, రెడ్డెప్ప, చైతన్యను ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం నూతన సభ్యులందరూ శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆమె క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.

అలరించిన కర్ణాటక సంగీత కచేరి


సితార్ కచేరి నిర్వహిస్తున్న అంకుష్


సంగీత కచేరి నిర్వహిస్తున్న జయతీర్థ్ మేవండి

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి చేరుకున్న ఉత్తర కర్ణాటకలోని 18 జిల్లాలకు చెందిన సత్యసాయి భక్తులు.. శనివారం కర్ణాటక సంగీత కచేరితో అలరించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రముఖ సితార్ విద్వాంసుడు అంకుష్.ఎస్.నాయక్ తన బృందంతో కలసి నిర్వహించిన కచేరీ భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. సాయంత్రం జయతీర్థ్ మేవండి హిందూస్తానీ సంగీతంతో ఆకట్టుకున్నారు. అనంతరం దాదాపు 4వేల మంది భక్తులు మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ బృందానికి నేతృత్వం వహించిన ఉత్తర కర్ణాటక సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పద్మనాభ పాయ్ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో అందిస్తున్న సేవలను వివరించారు.

అదిరిందయ్యో.. ఐడియా

చిలమత్తూరు: ట్రాక్టర్‌కు ట్రాలీను అమర్చుకుని సరుకు రవాణా చేయడం సర్వసాధారణం. అయితే ట్రాలీ బదులు ఎద్దుల బండ్లను ఏర్పాటు చేసి బండలను తరలిస్తున్నారంటే ఇందులో ఏదో తిరకాసు ఉందనే అనుకోవాలి. చిలమత్తూరు మండలం వీరాపురం వద్ద ట్రాక్టర్‌కు ఎద్దుల బండ్లను తగిలించుకుని క్వారీల నుంచి భారీ పరిమాణంలో ఉన్న బండలను తరలిస్తున్నారు. శనివారం ఉదయం ఈ దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. ట్రాక్టర్ ట్రాలీ ఎత్తుతో పోల్చుకుంటే ఎద్దుల బండి ఎత్తు తక్కువగా ఉంటుంది. బరువైన రాతి బండలను ఎత్తి లోడ్ చేయాలంటే ఎద్దుల బండినే మేలు. దీంతో రాతి బండల తరలింపులకు ఎంచక్కా ట్రాక్టర్‌కు ఎద్దులబండి కట్టి పని చక్కబెట్టేశారు.


ట్రాక్టర్‌కు ఎద్దుల బండిని తగిలించి బండలను తరలిస్తున్న దృశ్యం

సమాజ సేవలో ముందుండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం: సమాజసేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని జిల్లా న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. న్యాయసేవా అధికార సంస్థ సేవలపై వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు న్యాయ సేవా సదన్‌లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ సేవా అధికార చట్టంలోని సెక్షన్-22బి కింద శాశ్వత లోక్‌అదాలత్‌లు దేశ వ్యాప్తంగా ఏర్పడ్డాయని, వీటిలో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు ఫీజు, రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ఇరుపక్షాల మధ్య సామరస్య పరిష్కారానికి సహకరించని పక్షంలో అందుబాటులో ఉన్న ఆధారాల మూలంగా అప్పీలుకు ఆస్కారం లేని శాశ్వత పరిష్కారంగా తీర్పు వెలువరించగల అధికారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.దీనబాబు, ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్‌అదాలత్ ధర్మాసనం చైర్మన్, న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎం.రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు ప్రోత్సాహం

బత్తలపల్లి: ఉపాధిహామీ పనులతో పాటు మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని లింగారెడ్డి పల్లిలో శనివారం ఆయన పర్యటించారు. మెట్ట భూముల్లో పండ్ల మొక్కలు నాటి డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. బత్తలపల్లి మండల వ్యాప్తంగా మెట్ట భూములున్న 53 మంది రైతులకు సంబంధించి 147 ఎకరాల్లో చీనీ, మామిడి, దానిమ్మ మొక్కల పెంపకాన్ని చేపట్టినట్లు వివరించారు. రైతులు సక్రమంగా మొక్కలను సంరక్షించుకుని లబ్ధి పొందాలని సూచించారు. మొక్కల సంరక్షణ, పెంపకానికి సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.ఆదెప్ప, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.శ్రీనివాసరెడ్డి, క్షేత్రసహాయకులు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నూతన వధువు బలవన్మరణం


మృతి చెందిన తస్లీమా

హిందూపురం అర్బన్: పుట్టింటి ప్రేమ.. మమకారాలను వదులుకోలేక ఓ నూతన వధువు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని రహమత్‌పుర నివాసి తస్లీమా (20)కు 20 రోజుల క్రితం ఇదే పట్టణంలోని ముక్కిపేటలో నివసముంటున్న ముజమిల్‌తో వివాహమైంది. కొన్ని రోజులు భర్తతో కలిసి జీవించిన ఆమె ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో శనివారం తన పుట్టింటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. తలిదండ్రుల గారాబం, అత్తారింటికి వెళ్లడం ఇష్టం లేక తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తస్లీమా తల్లి పర్వీనా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అక్బర్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి మిగులు సీట్లకు ఈ ఏడాది మేలో పదో తరగతిలో 360కు పైబడి మార్కులతో రెగ్యులర్ పాసైన విద్యార్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలి. మెరిట్‌ను బట్టి ఈ నెల 27న సీట్లు కేటాయిస్తారు. పూర్తి వివరాలకు సంబంధిత గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించవచ్చు.

మృతుడు అనంతపురం వాసి

మడకశిర: స్థానిక మధుగిరి సర్కిల్‌లో విషం తాగి మృతి చెందిన వ్యక్తిని అనంతపురానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. నిరుపయోగంగా ఉన్న ఓ భవనంలో శుక్రవారం ఓ మహిళ, వ్యక్తి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తక్షణమే వారిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతుడి ఫొటోను ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపి ఆరా తీశారు. దీంతో మృతుడు అనంతపురంలోని పాతూరుకు చెందిన తిప్పేస్వామిగా ఆచూకీ లభ్యమైంది. అలాగే హిందూపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పద్మావతిగా గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.